# టోపీదాస్

శ్రీ అంపురంరాజుగారు బి.ఎ.

ఇలాంటి టోపీదాసులు పెద్దపెద్ద పట్టణాల్లో, ముఖ్యంగా చెన్నపట్టణంలో
క్రొత్తగా ఆపూరువచ్చిన అమాయికులను టోపీవేయడానికి
చూస్తూ వుంటారు. కొందరు మోసపోయి తరువాత
చేతులు పిసుక్కొనడంగూడా జరుగుతూవుంటుంది.
'దొంగలున్నారు, జాగ్రత' అని తెలియని
వారి కిది హెచ్చరిస్తుంది.

(బందరు బజారులో టోపీదాసు, దగుల్బాజీరావు, దబాయింపురావు నిలబడిఉంటారు. దగుల్బాజీరావు ఎడమచేతిలో గొడుగూ, కుడిచేతిలో సూటుకేసు ఉంటుంది.)

టోపీదాసు— ఓరే, దబాయింపురావు! జాగ్రత్తగా ఉండాల సుమా. మనిషినిబట్టి మార్చుకోవాలి. యిక్కడ కథ జరిగాక నీకు దగుల్బాజీ వచ్చి చెబుతాడులే. వీలయితే దబాయించు లేదా ఊరుకో. యీ గిల్టుగొలుసూ గడియారము బెజవాడలో 4 రూపాయలకేగా కొన్నది. ఎవడికన్నా 10 రూపాయల కంటగట్టినా చాలు, ముగ్గిరికీ మూడురెళ్లారు. కూలిగిడుతుంది. వెళ్లు ఆ లాంతరు స్తంభందగ్గర నుంచో!

(దబాయింపురావు వెడతాడు)

(విసినాటి మేజేళ్లు బూట్ వేసుకొని, పెద్దాపురం సిల్కు కట్టుకొని మోకాళ్ల వరకూ ఉన్న షార్టుకోటు, రంగద్దాలకళ్లజోడు, పొన్నుకర్ర బుట్టపాగాతో పల్లెటూరి పెద్దమనిషి అత్రోవ నొస్తాడు.)

దగుల్బాజీరావు—అయ్యా ఇలా దయచెయ్యండి?

పెద్దమనిషి—ఎందుకు?

దగు—ఈగడియారం కొంటున్నాను. తమరు కూడా కొంచం నాణ్యం చెయ్యండి. వాడడిగినంత యిస్తామేమిటి. యిరవైరూపాయలకు గవ్వకూడా ఎక్కువయితే నాకక్కర్లేదు.

టోపిదాసు—యిరవై కాదు. యాభై యన్నా నువ్వు కొనలేవు. నీ త్రోవని పో. యిదేం గడియారం. దొరలెట్టుకొనేది. దీని గొలుసుసే 50 చేస్తుంది.

పెద్ద—యిది బంగారం గొలుసా?

టోపి—ఔనండి. యిదేం ఆషామాషీదనుకున్నారేమిటి. బెజవాడప్లీడరుగారు నిన్న పైపుదగ్గర స్నానంచేస్తూ ఈ గడియారం అక్కడ పెట్టి మర్చి వెళ్లిపోయాడు. ఆలాంటివాళ్లు పెట్టుకొనేది లేదా మీ బోటి జమీందార్లు పెట్టుకోవాలండి సార్. అంతేగాని యీయనేం కొనగలడు. 20 రూపాయలట. పాపం బజారులో షరాబుదగ్గరకు పట్టుకెడితే గొలుసుకే 50 యిస్తాడు.

దగు—(పెద్దమనిషిని కొంచం ప్రక్కకు పిలిచి) ఏమండోయి. మీరు నామీదకు పోటీకు రాకండి. ఏదో ఎత్తేసి వాడిదగ్గరకు తక్కువకు లాగాలి. నాదికూడా బెజవాడే లెండి. పనిమీద యీ వూరు వొచ్చాను. ఆ ప్లీడరుగారు 3 కాసు లెట్టి చేయించాడా గొలుసు. నా బావమరిది తమ్ముడే చేసిందది. 3 కాసులు 60. గడియారం ఎంత లేదన్నా 40 చేస్తుంది. మొత్తం 100 రూపాయల సరుకది. ఏ యిరవైకో లాగాలని చూస్తున్నాను. మీరు అడ్డే

ధర కట్టకండి. నేను దాన్ని ఎవరికకన్నా అమ్ముకుంటే మీ పుణ్యమా అంటూ ఓ 50 రూపాయిలు మిగులుతాయి. (యిద్దరు దగ్గరకు వస్తారు).

దగు—ఏమోయ్. ఆఖరుమాట పాతికరూపాయిలకిస్తావా, లేదా చెప్పు. యిదిగో తీసుకో. (జేబులో మనిపర్సు బయటికితీసి. పర్సువిప్పి అందులో రూపాయ లిద్యాబోయేట్టు నటిస్తాడు.)

టోపి—పాతిక్కాదు 50 కన్నా యివ్వనని చెప్పలేదా. నీబోటిగాడికి దేమిటి ? యీ సిల్కుపంచిమీదకి, మేజోళ్ల మీదకి, కళ్లజోడుమీదకి యీ జమీందారుగారికి చేతినుంటే కలకలలాడుతుంది. సార్, పెట్టుకునిచూడండి సార్. యిందాక ఒకాయనికి 55 రూపాయలికి సెటిల్ చేశానండి సార్. ఆయనచేతికి పెట్టబోతే గొలుసు బిగువయిందండి. నా కక్కర్లేదన్నాడు. ఏంజెయ్యనండి. నా అదృష్టం. సార్, మీరు పెట్టుకోండి.

(పెద్దమనిషి చెయ్యి అందిస్తాడు. టోపిదాసు చేతికి వాచి తగిలిస్తాడు. సరిగ్గా సరిపోతుంది.)

టోపి—మీకు సరిపోయింది. ఏదో ధరకు మీరు తీసుకోండి. యిందాకటి 55 యిప్పించండి.

దగు—గంటనుంచి నేను బేరం చేస్తుంటే ఆయనకిస్తానంటావేమిటి. ఆయనిచ్చే డబ్బు నే నివ్వలేనా. యింకో రెండు తీసుకో మొత్తం 27.

టోపి—55 లోను 5 తగ్గిస్తాను. 50 కి తీసికో. లేదా నీ త్రోవను నీవు పో. నన్ను చంపుకు తినకు. నూరురూపాయల సొమ్ము తేరగా దొబ్బుదామని. నీ యెత్తు నాకు తెలుసు.

దగు—మరోటి తీసుకో యిదిగో 28.

(పర్సు తియ్యబోతాడు)

టోపి—పోవోయ్. వంకాయ్ల బేరంచేశావ్.

దగు—(పెద్దమనిషిని ప్రక్కకు పిలిచి) యీ గడియారానికి 40 రూపాయలవరకూ పెట్టదలచుకున్నాను. ఒకోటీ రెండేసీ హెచ్చిస్తూవస్తాను. యింకెవరూ కొనకపోతే నాకే యిస్తాడు. మీ త్రోవను మీరు వెళ్లిపోండి, నాగొడుగూ, సూటుకేసు తీసుకుని, నా త్రోవను నేను పోతాను. మళ్లా 5 నిమిషాల్లో వచ్చి ఆఖరుమాట ఆ 40 యిచ్చి తీసుకుంటాను. అస్తమానం వాడిదగ్గరుంటే మా బెట్టుగా ఉన్నాడు. (త్రోవ తీస్తాడు)

(పెద్దమనిషికూడా వెళ్లబోతాడు)

టోపి—సార్ నా గడియారం మీ చేతినుందండి సార్. మీ కక్కర్లేకపోతే నాదినాకిచ్చెయ్యండి.'

(పెద్దమనిషిదగ్గరకొచ్చి గడియారం తియ్యబోతాడు).

టోపి—'ఉండివ్వండి సార్. మీ యిష్టం వచ్చినంత యివ్వండి. మీబోటి ఘామేదా మనుష్యులకిచ్చాక తిరిగి పుచ్చుకోవడం నాకూ న్యాయంకాదు. చేతిక్కట్టుకున్నాక తిరిగి యివ్వడం మీ దర్జాకు తగిన విషయం కాదు. మీ యిష్టం వచ్చినంత యివ్వండి. సందర్భం అంతా మీకు విన్నవించానుగా.

పెద్ద—నాదగ్గరన్ని రూపాయలు లేవు. తక్కువ కడిగితే న్యాయంగా ఉండదు.'

టోపి—చిత్తం. తమబోట్లు అసలు బేరంచెయ్యడమే గౌరవానికి లోటు. మీ దగ్గర ఎంతుంటే అంతే యివ్వండి. నేను మాత్రం యిది కష్టపడి సంపాదించిందా ఏమిటి. కర్ణుడు చేతిని దానకంకణంలాగ ప్రకాశిస్తోంది మీకీ గడియారం.

పెద్ద—నా దగ్గర 36 రూపాయి లున్నాయి.

టోపి—తమచిత్తం. దయచెయ్యండి.

పెద్ద—నాకు త్రోవ ఖర్చుకు ఒకరూపాయి కావాలి. 35 తీసుకో. (టోపీదాసుకు రూపాయలిస్తాడు)

టోపి—చిత్తం. అదేమిటో మీ కివ్వాలని అవో పిచ్చి భ్రాంతిమీద యిచ్చేస్తున్నాను. యిది మీకు ప్రాప్తుంది. సార్, ఒక్కమాట, బెజవాడలో మాత్రం యీ గడియారం పెట్టుకోకండి. పోలీసాళ్లు పట్టుకుంటారు.

(యిద్దరూ చెరోవైపు వెడతారు దబాయింపు రావు దగుల్బాజీరావు పెద్దమనిషి కెదురు వస్తారు.)

దగు—బాబు యీయనే నండి. నే కొనలేదు ఇదిగోనండి. ఈయన చేతినుంది.

దబా—బెజవాడప్లీడరు గడియారం దొరకింది, చోరీ ఆస్తిదొరికింది. డేంజర్ నడు, పోలీస్‌స్టేషనుకు నడు. లాకప్‌లో ఉంచుతాను.

పెద్ద—నువ్వెవడవు, నన్నడగడానికి.

దబా—సువార్ నోరుముయ్యి. నే నెవ్వడోన్నె స్టేషనుకు నడు తెలుస్తుంది.

దగు—ఈయన సి.ఐ.డి పోలీసు మారువేషంమీద వచ్చారు. నేను బ్రతికాను దేవుడా, నేను కొంటే నన్ను జైలుకు తీసుకెళ్లును.

దబా—తిన్నగా నోరుమూసుకు నడుస్తావా, లేకపోతే విజిలెయ్యనా పోలీసాళ్లొచ్చి యిక్కడే ముసుగులేస్తారు,

(జేబులో విజిల్ తియ్యబోతాడు)

దగు—అయ్యో, ఈయన చాలా పెద్దమనిషండి. తెలియకకొన్నాడు. రక్షించండి. ఏదోవిధంగా.

పెద్ద—రక్షించండి (వణుకుతూనమస్కరిస్తాడు).

దబా—అయితే చోరీ ఆస్తి వప్పజెప్పి సమాధానం చెప్పుకో.

దగు—(పెద్దమనిషిని ప్రక్కకు పిలిచి) మీ దగ్గ రెంతుంది.

పెద్ద—త్రోవఖర్చుకు ఒక్కరూపాయి మాత్రం ఉంది.

దగు—ఇలా యివ్వండి. (పెద్దమనిషి యివ్వగా పుచ్చుకొంటాడు.) 'దీనికయితే ఆయన ఒప్పుకోరు. యిప్పుడు ఖయిదులోపెడితే జామీ నెవరుంటారు. స్టేషనుకెడితే అసలు యిన్స్పెక్టరుగారు విడిచిపెట్టరు. యిదంతా ఖర్మం. ఏంజేస్తాం. మీ వ్రేలుఉంగరం ఆ గడియారం ఆయనకిచ్చి విడిచిపెట్టమని బ్రతిమాలుకోండి.

(గడియారం, ఉంగరం, దబాయింపురావు చేతిలో పెద్దమనిషి పెడతాడు. దబాయింపురావు జేబులో వేసుకుంటాడు.)

దబా—మీరు పెద్దమనిషిలా కనబడుచున్నమూలాన్ని విడిచిపెట్టాను. దీనివిషయంలో సి.ఐ.డి. పోలీసులు తిరుగుతున్నారు. మీ రీమాట ఎవరిదగ్గరన్నా అన్నారంటే, అక్కడే సి.ఐ.డి. అరెస్టు చేస్తారు, జాగ్రత్త. (వెడలిపోతాడు).

పెద్ద—ఆ రూపాయిలాతే. నా త్రోవఖర్చుకు లేదు.

దగు—యిది నేను రాయబారం చేసినందుకు. నేను లేకపోతే యీపాటికి ఖయిదులో నే ఉందువు.

(ఇద్దరూ చెరోత్రోవనూ పోతారు.)